ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఘన నివాళి



ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తున్న స్మితాసబర్వాల్ తదితరులు

బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు టూరిజం ప్లాజాలో ఆ శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ నివాళులర్పించారు. బేగంపేటలోని బాలయోగి పర్యాటక భవన్‌లో టూరిజం ఆపరేటర్లు బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆమె పాల్గొన్నారు. అంతకు ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్ మాట్లాడుతూ ఇది అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ముష్కరులకు నాగరిక సమాజంలో జీవించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో రమేష్ అయ్యంగార్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వీరేంద్రసింగ్ రాణా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్ర చర్య దారుణం

● **మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి**



బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై ఉగ్రవాదుల దాడి హేయనీయమని ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో పాటు పీఓకేలోని వారి సహకారంతోనే ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ దాడులకు పాల్పడిన వారితో పాటు ప్రోత్సహించిన వారు, సహాయపడిన వారు రానున్న రోజుల్లో తగిన మూల్యం అనుభవించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. భవిష్యత్‌లో దాడులు చేయాలంటేనే ఉగ్రవాదులు హడలి పోయేలా కేంద్ర ప్రభుత్వం వారిని అణిచివేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు కొవ్వొత్తుల నివాళులర్పించారు. చిత్రంలో కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, వీణామాధురి తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

ఉగ్రవాదులపై ప్రతీకార చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీకే అరుణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యలు తప్పవని బీజేపీ నాయకులు ముక్తకంఠంతో నినదించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గంలోని డాక్టర్ అంబేడ్కర్ భారీ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీకే అరుణ, డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని మోదీతో పాటు యావత్ దేశం ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారని, అమాయకుల ప్రాణాలు తీసి పైశాచికత్వం పొందడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ర్యాలీలో బీజేపీ నాయకులు గౌతంరావు, శ్రీధర్, చంద్రుబాబా, వీణామాధురి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి ఖండన



పీపీ రవిశేఖర్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటక ప్రాంతంలో రక్తం పారించడాన్ని వినియోగదారుల హక్కుల ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు విచక్షణ కోల్పోయి జరిపిన దాడిలో మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆలయాల్లో ప్రార్థనలు చేశారు.



కశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ ఖైరతాబాద్‌లో టీపీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

టూరిస్టులపై దాడి హేయం

జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు



ఖైరతాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పీపుల్స్‌ప్లాజా నుంచి రోటరీ చౌరస్తాలోని పీవీ నర్సింహారావు విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ తీశారు. అక్కడ బైఠాయించి పెద్ద ఎత్తున ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ టూరిస్టులను టార్గెట్‌గా చేసుకొని దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇది ఎవరిపైనో జరిగిన దాడిలా కాకుండా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జరిగిన దాడిగా భావించి ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ ఘటనతో తీవ్ర మనోవేదనకు గురయ్యారని, కేంద్ర ప్రభుత్వం ఈ సంఘటనపై గట్టి చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ర్యాలీలో జనసేన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, నాయకులు ప్రేంసాగర్, దామోదర్‌రెడ్డి, రత్నం, సురేష్‌రెడ్డి, మాధవరెడ్డి, కావ్య, ఆర్‌కె.సాగర్ పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుంటున్న నీతా అంబానీ తల్లి, సోదరి

ఎల్లమ్మను దర్శించుకున్న నీతాఅంబానీ తల్లి, సోదరి

అమీర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రిలయన్స్ దిగ్గజం ముఖేష్ అంబానీ సతీమణి నీతాఅంబానీ తల్లి పూర్ణిమ దలాల్, సోదరి మమత దలాల్ బుధవారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన వారిని ఈవో కృష్ణ సాదరంగా గర్భగుడిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వీరికి అర్చకులు శేషవస్త్రాలను బహూకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం పూర్ణిమ, మమత దలాల్ నల్లపోచమ్మ ఆలయం, అద్దాల మండపాన్ని సందర్శించి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకులు అనిల్, తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్‌లోని వేగా జువెలర్స్‌లో

అక్షయ తృతీయ ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయను పురస్కరించుకొని జూబ్లీహిల్స్‌లోని వేగా జువెలర్స్‌లో మోడల్స్‌తో ప్రత్యేక ఆభరణాలతో ప్రదర్శన ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు. దక్షిణ భారతంలోనే అతిపెద్ద జువెలరీ ఫెస్టివల్‌ను నిర్వహించడం ద్వారా వినియోగదారులు గొప్ప షాపింగ్ అనుభూతిని పొందుతారని వారు పేర్కొన్నారు. బంగారం, డైమండ్, పోల్కీ ఆభరణాలతో అపూర్వమైన ఆఫర్లు అక్షయ తృతీయ ఫెస్టివల్‌లో ఉంటాయని, ప్రస్తుత ఆఫర్లు పరిమిత కాలమే అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కొనుగోలు చేసిన వారికి తరుగు, తయారీకి ప్రత్యేకంగా చెల్లింపులు చేయకుండానే నచ్చిన ఆభరణాలను కొనుగోలు చేయవచ్చని వారు తెలిపారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



ఎం.ఎస్.మక్తాలో పాదయాత్ర చేస్తున్న లక్ష్మీనారాయణమ్మ

బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తా, హరిగేట్, బీఎస్‌మక్తా తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. ప్రధానంగా విద్యుత్, తాగునీటి కొరత లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



శాంతారామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు వనజ, కుటుంబ సభ్యులు, తదితరులు

శాంతారామ్ మరణం తీరని లోటు

పంజాగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ పాత్రికేయుడు బి.శాంతారామ్ మృదుస్వభావి అని, ఆయన మరణం తీరని లోటని ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు సి.వనజ అన్నారు. ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బి.శాంతారామ్ సంతాపసభ జరిగింది. ఆయన తల్లి అనసూయమ్మ, సోదరుడు రవీంద్ర, సోదరి ధనశ్రీ, కుటుంబ సభ్యులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, పలువురు పాత్రికేయులు శాంతారామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ పత్రికలలో ఆయన నిబద్ధతతో పనిచేశారని, వివాదాలకు పోని వ్యక్తి అని వనజ పేర్కొన్నారు. జర్నలిస్ట్ గా తన ప్రయాణం ఆయన వద్ద నుంచే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానిని ఆయన నివాసంలో కలిసిన సిక్కులు

నీటి సమస్యను పరిష్కరించాలి

అమీర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా తీవ్ర నీటి ఎద్దడితో నానా అవస్థలు పడుతున్నామని, అమీర్‌పేట గురుద్వార పక్కన ఉన్న సిక్వాడిలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సిక్కులు కోరారు. మాజీ కార్పొరేటర్ శేషకుమారితో కలిసి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నెల రోజులుగా లో ప్రెషర్ నీటి సమస్యతో బాధపడుతూ కరెంట్ మోటార్లు పెట్టుకుంటే వాటిని లాక్కెళ్లి పోతున్నారని, మోటార్లు పెట్టినా చుక్క నీరురావడం లేదని మొరపెట్టుకున్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన తలసాని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేందర్‌సింగ్, జోగిందర్ సింగ్, ప్రహ్లాద్‌సింగ్, చరణ్‌సింగ్, సుమిత్ సింగ్‌తోపాటు కూతురు నర్సింహ, కట్టా బలరాం పాల్గొన్నారు.

గ్రూపు-1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



పృథ్వీరాజ్ యాదవ్‌ను నిలదీస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

పంజాగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూపు-1 పరీక్షల అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడీషియల్ విచారణ జరిపించాలని, మెయిన్స్ పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. నిరుద్యోగులు, అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవద్దని వారు అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్ట్ విఠల్, పోటీ పరీక్షల శిక్షకుడు రవిశంకర్, సంచార జాతుల దక్షిణ భారత బోర్డు సభ్యుడు నర్సింహ, అభ్యర్థులు, నిరుద్యోగులు జనార్దన్, ప్రత్యూష, రేఖాసింగ్, హరికృష్ణ, తదితరులు మాట్లాడారు. తెలుగు అభ్యర్థుల లిస్టును ఎందుకు దాచి పెడుతున్నారని వారు ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. అభ్యర్థులకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ గ్రూపు-1 పరీక్షలో మోసం, కుట్ర జరిగిందని ఆరోపించారు. పదుల సంఖ్యలో మందికి మార్కులు ఒకే విధంగా ఎలా వస్తాయని ప్రశ్నించారు. వెంటనే మెయిన్స్ పరీక్షలు రద్దు చేసి తిరిగి నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్‌లో మహిళలకు ప్రత్యేక పరీక్షా కేంద్రాలు లేనప్పుడు కేవలం మెయిన్స్ లోనే ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతుండగా సమస్యను పక్కదారి పట్టించవద్దని, అభ్యర్థుల తరపున పోరాడుతున్న తమ పార్టీపై నిందలు వేయడం సరికాదని ఎర్రోళ్ల శ్రీనివాస్ అనడంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. సమావేశంలో పలువురు అభ్యర్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయం నీటిసంపులో పడి భక్తుడు మృతి



బాలాజీ

అమీర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నీటిసంపులో పడి భక్తుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన డి.బాలాజీ(55) అదే ప్రాంతానికి చెందిన బంధువులు, మరి కొంతమందితో కలిసి బుధవారం మధ్యాహ్నం బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించాడు. భోజనాల అనంతరం సాయంత్రం 4.40 గంటల సమయంలో ఆలయంలోని కొబ్బరికాయలు కొట్టే ప్రాంతానికి వెనక వైపు ఉన్న సంపు వద్దకు వెళ్లి తిరిగి వచ్చాడు. మళ్లీ తన సెల్‌ఫోన్ పడిపోయిందంటూ కొబ్బరి కాయలు కొట్టే ప్రాంతంలో ఉన్న ఆలయ సిబ్బందికి చెప్పాడు. తిరిగి సంపు వద్దకు వెళ్లగా అతడిని చూడలేదు. కొద్దిసేపటి తర్వాత ఆలయ పూజారి ఒకరు వెళ్లి చూడగా బాలాజీ నీటి సంపులో అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే అతడి వెంట వచ్చిన వారు సమీపంలోని అమీర్‌పేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలాజీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆలయ సిబ్బంది సకాలంలో స్పందిస్తే బాలాజీ ప్రాణాలు దక్కేవని బంధువులు, మిత్రులు ఆలయంలో ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు

రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు

● **యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా రాకపోకలకు భంగం కలిగిస్తున్న మైనర్ యువకులను అదుపులోకి తీసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన 9 మంది యువకులు అర్ధరాత్రి నడి రోడ్డుపైన యాక్టివా(ఏపీ09ఎఫ్‌ఎక్స్ 0316)పై పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు. అదేసమయంలో పెట్రోలింగ్ పోలీసులు మైనర్ యువకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

పార్క్ చేసిన బైక్ నుంచి పెట్రోల్ చోరీ

అమీర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బాపునగర్‌లో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చేసుకుని రాత్రివేళ పెట్రోల్ మాయం చేస్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి మరో సంఘటన బయటపడింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాపునగర్‌లోని ఆర్ ఆర్ డీలక్స్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న సంజయ్ హాస్టల్ ముందు తన బైక్‌ను పార్క్ చేసి లోనికి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి మెలుకువ రాగా కిందకు వచ్చాడు. అప్పటికే తన బైక్ వద్ద నిల్చొని అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు యువకులను ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. దీంతో బైక్ నుంచి బాటిళ్లలోకి తీసిన పెట్రోల్‌ను అక్కడే వదలి పెట్టి ఇద్దరు యువకులు పరారయ్యారు. పలుమార్లు పెట్రోల్ చోరీ జరుగుతుండడంతో విసిగిపోయిన సదరు యువకుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఆస్పత్రి నుంచి యువతి అదృశ్యం

బోరబండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి నుంచి యువతి అదృశ్యమైంది. బోరబండ పోలీసులు తెలిపిన ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన నాగరాజు భార్య ఏర్పుల నాగేంద్రమ్మ(31) మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఈనెల 17న ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. 22న ఆమెతోపాటు ఉన్న తల్లి బుజ్జమ్మ స్నానం చేసి వచ్చే సరికి నాగేంద్రమ్మ కనిపించలేదు. ఆస్పత్రి సిబ్బందితో కలిసి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె సోదరుడు ఏర్పుల శివ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులకు నోచని రహదారులు

● కుంగిన మ్యాన్‌హోల్

● పట్టించుకోని అధికారులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణానగర్ 'ఏ' బ్లాక్, లక్ష్మీనరసింహనగర్, గణపతి కాంప్లెక్స్ వెనక, ఎదురు రహదారులుతో పాటు పీజేఆర్ క్రీడా మైదానం సమీపంలో తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రహదారులు వర్షం కురిసినప్పుడు వరదకు కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనికితోడు తవ్విన మ్యాన్‌హోళ్ల వద్ద మరమ్మతులు చేపట్టకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వదిలేశారు. లక్ష్మీనర్సింహనగర్ డోర్ నెంబర్.283 ఎదురుగా, శ్రీ కృష్ణానగర్ 'ఏ' బ్లాక్ డోర్ నెంబర్.172 ఎదురుగా మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు, రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పీజేఆర్ క్రీడా మైదానం రోడ్డు



గణపతి కాంప్లెక్స్ ఎదురు, వెనక రోడ్లు



ఎల్ఎన్ నగర్ నుంచి కృష్ణానగర్ రోడ్డు



ఎల్ఎన్‌నగర్‌లో కుంగిన మ్యాన్‌హోల్

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

రహదారులు గుంతలమయంగా మారాయి. అధికారులు బస్తీల్లో పర్యటించి తక్షణమే గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. మ్యాన్‌హోల్ వద్ద తవ్విన రోడ్డును పూడ్చకుండా వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఏజీ మోహన్‌రావు, టీడీపీ సీనియర్ నాయకుడు



ఆరోగ్య కేంద్ర వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

సికింద్రాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. బుధవారం బాలంరాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న సదుపాయాలను, పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీ తీరుతెన్నులపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది విజ్ఞప్తి మేరకు అదనపు బెడ్లు ఏర్పాటు చేయడానికి పక్కనే ఉన్న మూడు గదులను కూడా పీహెచ్‌సీకి కేటాయించాలని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్‌కు ఫోన్ చేసి కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎలాంటి అవసరం ఉన్నా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కార్ఖానా బస్తీలో..

కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ బుధవారం కంటోన్మెంట్ శానిటేషన్ సూపరింటెండెంట్ ఆకుల మహేందర్ తదితర అధికారులతో కలిసి పర్యటించారు. 19న నిర్వహించిన పర్యటనలో స్థానికులు పలు సమస్యలు మొర పెట్టుకున్నారు. దాంతో తాను అధికారులతో కలిసి మళ్లీ పర్యటిస్తానని, సమస్యలను పరిశీలిస్తానని ఆయన చెప్పారు. మాట ప్రకారం బుధవారం బస్తీలో పర్యటించారు. తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, నాలా తదితర సమస్యల గురించి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలు, అంచనాలు రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్కా మధు ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

పార్టీ కోసం నిరంతరం పనిచేస్తాం

అడ్డగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తాము బీఆర్ఎస్ పార్టీకి సైనికులం, పార్టీ కోసం అహోరాత్రులు శ్రమిస్తామని సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్కా మధు అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి తుకారాంగేట్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ భారీసభకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు, సీనియర్ యువ నాయకుడు రామేశ్వర్‌గౌడ్ నాయకత్వంలో పార్టీ కోసం శ్రమించి పనిచేస్తామన్నారు.



బడిబాట ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి

అడ్డగుట్టలో బడి బాట

- ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్ని బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులకు ఉందని మారేడుపల్లి మండలం ప్రభుత్వ డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అడ్డగుట్టలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో తుకారాంగేట్, అడ్డగుట్ట మరాఠబస్తీ పరిసర ప్రాంతాల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుకోవడానికి పుస్తకాలు, బ్యాగులు, టిఫిన్ బాక్సులు, దుస్తులు ఉచితంగానే అందిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల్ని తప్పకుండా బడికి పంపించాలని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి, వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు పవన్ రాజ్, టీచర్లు రామలక్ష్మి, కరుణశ్రీ, సునీత, గీత, పద్మావతి, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, గోపి, ఎంవీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శులు సువర్ణ, రమాదేవి పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

కోడలి వేధింపులు.. అత్త ఆత్మహత్యాయత్నం



నూనె సుశీల

బోయినపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అత్తారింటి వేధింపులు భరించలేక కోడలు ఆత్మహత్య అనే వార్తలను చదివే ఉంటాం. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. కోడలి వేధింపులు తట్టుకోలేక అత్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి వివరాల ప్రకారం నూనె వెంకటేష్, నూనె సుశీల(44) భార్యాభర్తలు. వీరు 35 సంవత్సరాలుగా బోయినపల్లి బాపూజీనగర్‌లో నివసిస్తున్నారు. సుశీల భర్త చనిపోవడంతో ఇళ్లలో పని చేసుకుంటూ జీవిస్తోంది. ఈమెకు ఓ కుమారుడు, ఓ కుమార్తె. అయితే కుమారుడు వెంకటేష్‌కు ఐశ్వర్యతో వివాహం జరిగింది. ఈ క్రమంలో కొంతకాలంగా అత్త, కోడళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ వేధింపులు తట్టుకోలేని అత్త మంగళవారం రాత్రి బాపూజీనగర్ పెట్రోల్‌బంక్‌కు వెళ్లి 100 రూపాయల పెట్రోల్‌ను కొనుగోలుచేసి తీసుకువచ్చింది. పక్కనే ఉన్న స్మశాన వాటికలోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో 90 శాతం కాలిన గాయాలతో ఉన్న ఆమెను స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల వెంటనడుస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించిన ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కేతావత్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం డౌన్‌లైన్ వద్ద గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతుండగా రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఈ విషయాన్ని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. మృతుడి జేబులో ఎటువంటి అడ్రస్ ఐడీ కార్డులు లేవని ఈ వ్యక్తి ఆచూకి తెలిసిన వారు వెంటనే 8712568581 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫామ్ నంబరు 3లో గుర్తుతెలియని 40 ఏళ్ల మృతిచెందాడు.సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం కొరకు గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8712568516 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టెర్రరిస్టులపై ఉక్కుపాదం మోపాలి



పహల్గాం కాల్పుల్లో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతున్న జంపన ప్రతాప్‌తో వాకర్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు



బోయినపల్లిలోని సీఎంఆర్ పాఠశాల నుంచి ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న విద్యార్థులు

బోయినపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో టెర్రరిస్టులను అంతమొందించాలని పహల్గాం ఉగ్రదాడి ఘటనకు కారణమైన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కేంద్రాన్ని కోరారు. బోయినపల్లి ప్లేగ్రౌండ్ కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి బుధవారం నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో అస్థిరతను కల్పించేందుకు ముష్కరులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని అన్నారు. ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్, సాయిబాబా యాదవ్, వరప్రసాద్, యాదగిరి, వెంకటేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

- ప్రపంచదేశాలు టెర్రరిస్టులపై ఉక్కుపాదం మోపాలని, అదేవిధంగా ఏ దేశం కూడా వారికి ఆశ్రయం కల్పించకుండా చర్యలు తీసుకోవాలని సీఎంఆర్ విద్యాలయాల అధిపతి సిహెచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో టూరిస్ట్‌పై ఉగ్రవాదులు కాల్పుల్లో సుమారు 27 మంది అమాయక ప్రజలు మృతి చెందారు. బోయినపల్లి సీఎంఆర్ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. టెర్రరిస్టులకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ బోయినపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, ట్రైనింగ్‌లో ఉన్న విద్యార్థులు పాల్గొన్నారు.

స్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో..



పద్మారావునగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల పైశాచిక దాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ పద్మారావునగర్‌లోని స్కందగిరి శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలోని ప్రధాన గోపురం వద్ద ఆలయ అర్చకులు కన్నన్, రాజేశ్, భరద్వాజ్, శ్రీరామ్, కాశిలు ఐదు మోక్ష దీపాలను వెలిగించారు.

ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి ఘన నివాళి..



బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు బేగంపేటలోని బాలయోగి పర్యాటక భవన్‌లో ఉన్న టూరిజం ప్లాజాలో ఉన్న టూరిజం ఆపరేటర్లు ఏర్పాటు చేసిన సంతాప సభలో టూరిజం శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఉగ్రదాడిలో పాల్గొని మృతి చెందిన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ సంతాప సభలో రమేష్ అయ్యంగార్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వీరేంద్ర సింగ్ రానా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం కాశ్మీర్‌లో జరిగిన కాల్పుల నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు సికింద్రాబాద్ ప్యారడైజ్ సర్కిల్ వద్ద గల ఓయో రూమ్స్‌లలో తనిఖీలు నిర్వహించి ప్యారడైజ్ చౌరస్తాలో బందోబస్తు నిర్వహిస్తున్న రాంగోపాల్ పేట్ పోలీసులు.

- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

బౌద్ధనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, సనత్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజలు ముఖ్యఅతిథులుగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు ఎంఎన్.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, ప్రకాశ్, ధనశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, శైలేందర్, మహేశ్‌నాయుడు పాల్గొన్నారు.

బేగంపేటలో..

బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుమ్మరబస్తీలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎ. మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోస్టర్లు అంటించి ప్రచారం

బోయినపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలను అభిమానులను తీసుకువెళ్లి విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ తన కార్యకర్తలతో కలిసి ఆటోరిక్షాలు, భారీవాహనాలకు పోస్టర్లను అంటించి ప్రచారం చేశారు.

పహల్గాం ఉగ్ర చర్య దారుణం

- మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడి హేయనీయమని ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో పాటు పీఓకేలోని వారి సహకారంతోనే ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ దాడులకు పాల్పడిన వారితో పాటు ప్రోత్సహించిన వారు, సహాయపడిన వారు రానున్న రోజుల్లో తగిన మూల్యం అనుభవించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. భవిష్యత్‌తో దాడులు చేయాలంటేనే ఉగ్రవాదులు హడలి పోయేలా కేంద్ర ప్రభుత్వం వారిని అణిచివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ వరంగల్ సభ సన్నాహక సమావేశం

బోయినపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలను, అభిమానులను తీసుకెళ్లి సభను విజయవంతం చేయడానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని కిరణ్, బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టి ఎన్ శ్రీవాసస్, బీఆర్ఎస్ నాయకుడు ఆకుల హరికృష్ణలు సభ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

బేగంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తా, హరిగేట్, బీజేనమక్తా తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. ప్రధానంగా విద్యుత్, తాగునీటి కొరత లేకుండా చేశారన్నారు.



పాఠశాల కరపత్రాన్ని విడుదల చేస్తున్న డిప్యూటీ ఐఓఎస్ గుండప్ప

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పీటీఎం

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం నల్లగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(డిజిటల్ స్కూల్)లో పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం) నిర్వహించారు. ఈ సమవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఐఓఎస్ గుండప్ప విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నాబత్తిని శౌరీ, ఇతర ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలకు చెందిన కరపత్రాన్ని విడుదల చేయగా, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతినభూనారు



రఘునాథ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ఆత్మీయ వీడ్కోలు

చిలకలగూడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్ నిలయంలో విధులు నిర్వహిస్తూ నెలాఖరుకి పదవీ విరమణ చేయనున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్ రఘునాథ్ దేవరాజన్‌కి బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 35 సంవత్సరాల అనూభూతులు, అనుభవాలు గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. సహ ఉద్యోగులు, ఎంప్లాయిస్ సంఘ్ మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్ తదితరులు శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.



విద్యార్థులకు అభినందనలు

మారేడుపల్లి కస్తూర్బా గాంధీ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి ఏ.హుస్సేన్, కోశాధికారి వి.సురేందర్, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ చారుమతి దేవి, లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

- (మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి)



పుస్తకాల అందజేత

హిందూ మహాసేవక సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయుష్ ఆర్ఫనేజ్‌లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌లు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవి బాల్‌రాజ్, నాగేందర్, రషీద్ హిందూ మహాసేవక్ సంఘ్ అధ్యక్షుడు జీవి కార్తిక్ పాల్గొన్నారు.

- తిరుమలగిరి ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ సభకు తరలి రావాలి



సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్స్‌ను స్థానిక కార్పొరేటర్ సామల హేమ కన్వీనర్ రాజు సుందరం పార్టీ కార్యకర్తలతో కలిసి గోడలకు అతికించారు. 27న బహిరంగ సభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

- (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

తార్నాకలో..

తార్నాక, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని గ్రేటర్ హైద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైద్రాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి పిలుపునిచ్చారు. బుధవారం తార్నాకలో ఆయన ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు సంబంధించిన గోడ పత్రికను ఘనంగా ఆవిష్కరించారు.

ఉచిత యునాని వైద్య శిబిరం



రోగుల వివరాలను తెలుసుకొంటున్న వైద్యులు

పద్మారావునగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులకు యునాని వైద్యంలో చికిత్స లభిస్తుందని యునాని వైద్యులు డాక్టర్ సుభాని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ ద్వారా మొబైల్ హెల్త్ కేర్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి చాచానెహ్రూనగర్ కమ్యూనిటీ హాలులో ఉచిత యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాని, డాక్టర్ సాదియాలు శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్‌ప్లాన్ ద్వారా పేదలు నివసించే ప్రాంతాల వారికి యునాని వైద్యం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అందించటానికి ప్రతీరోజు నగరంలోని అనేక ప్రాంతాలలో శిబిరాలను నిర్వహిస్తున్నామని సుభాని తెలిపారు. ముఖ్యంగా చర్మ, శ్వాసకోశ సంబంధిత, జీర్ణకోశ సమస్యలు, సయాటికా, నరాల సమస్య, పక్షవాతం, కీళ్లనొప్పులు వంటి అనేక సమస్యలకు యునాని వైద్యం ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో మందులను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ప్రతీ మంగళవారం కవాడిగూడలోని ముగ్గుబస్తీ కమ్యూనిటీ హాలులో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు విజయ్‌పాల్, దినేశ్‌లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- రెండు ప్రాంతాల్లో ముగ్గురు గంజాయి స్మగ్లర్స్ అరెస్టు
- 5.260కేజీల గంజాయి, కారు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బృందాలుగా ఏర్పడి సిటీలో పలు చోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతంలో రెండు చోట్ల ముగ్గురు స్మగ్లర్స్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 5.260 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

- **ఆదిలాబాద్ నుంచి నగరానికి..**

నిర్మల్ ప్రాంతానికి చెందిన మలావత్ రాజేందర్, ఇండాల రాథోడ్‌లు ఆదిలాబాద్ జిల్లా శివారులో దొరికే గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కొంతకాలంగా హైదరాబాద్‌కు కారులో అక్రమ రవాణా చేసి డిమాండ్‌ను బట్టి గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సీఐ సౌజన్య ఆధ్వర్యంలోని డీటీఎఫ్ (డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్) బృందం దాడి చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కారు డిక్కీలో ఉన్న 4.10 కేజీల గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో సీఐ సౌజన్యతో పాటు.. ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుళ్లు రాజు రవి, సునీతలు పాల్గొన్నారు.

- **కొండాపూర్‌లో..**

శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్న సమాచారం మేరకు శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) రంగంలోకి దిగారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నారాయణ చౌదరిని అరెస్టు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న నారాయణ.. ఐటీ కారిడార్‌లోని వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని విక్రయాలు చేస్తున్నట్లు తేలింది. అతని వద్ద నుంచి 1.120కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్‌టీఎఫ్ ఎస్సై జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ లేఖా సింగ్, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, చంద్రశేఖర్, కాశీరావు, శశి ఉన్నారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





సికింద్రాబాద్‌లో ఎక్సైజ్ పోలీసులకు గంజాయితో పట్టుబడ్డ నిందితులు, శేరిలింగంపల్లిలో పట్టుబడ్డ నిందితుడు, చిత్రంలో గంజాయి